క్లుప్తంగా

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రకాశం నగర్: భారత ప్రభుత్వం ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందించే పద్మ అవార్డులు 2026కు సంబంధించి, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ కోసం అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి గురువారం ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అర్హత గల క్రీడాకారులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకుని ఆ పత్రాలను పీడీఎఫ్ ఫార్మాట్‌లో స్పోర్ట్స్ ఇన్ ఏపీ జీమెయిల్ డాట్ కామ్‌కు మెయిల్ చేయాలన్నారు. ఈనెల 26 వరకూ గడువు ఉన్నట్టు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కడియం: మురమండ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మాధవరాయుడుపాలెం ఏజీఎల్ బ్రేకర్ కొత్తగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కారణంగా మురమండ హెచ్‌క్యూ ఫీడర్, మురమండ ఏజీఎల్ ఫీడర్, దుళ్ల ఫీడరు, పొట్టిలంక ఫీడర్ పరిధిలోని వీరవరం గృహాలు, వ్యవసాయ బోర్లు, పొట్టిలంకలోని వ్యవసాయబోర్లు, మాధవరాయుపాలెం ఫీడరు, మురమండ ఇండస్ట్రియల్ ఫీడర్, మెహర్ గాయత్రీ ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

జయరాజు సేవలు అభినందనీయం



జయరాజు దంపతులను సత్కరిస్తున్న గోరంట్ల, చినరాజప్ప, చిక్కాల రామచంద్రరావు తదితరులు

కడియం: వేమగిరితోట ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయుడు కంచపు జయరాజు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు అన్నారు. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న జయరాజును గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు.. జయరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, డీఈవో వాసుదేవరావు పాల్గొన్నారు.

జలనిధి సర్వీస్‌తో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తదితరులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల (జీసీఆర్ జేవై) భూగర్భ శాస్త్ర విభాగం, జలనిధి జియో సర్వీసెస్ అండ్ కన్సల్టింగ్ జియాలజిస్ట్ (జేజీ–సీజీ) మధ్య పరస్పర ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. ఈ మేరకు గురువారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే, జేజీ – సీజీ డైరెక్టర్ ఉమామహేష్ ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భూగర్భశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎంఆర్ గౌతమ్, విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులకు భూగర్భ జల అన్వేషణకు సంబంధించిన విధానాలు, రెసిస్టివిటీ సర్వేలు, హైడ్రో జియోకెమికల్ స్టడీస్లో ప్రాయోగిక శిక్షణ కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుంది.

అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న ఏఎస్పీలు

కంబాలచెరువు: స్థానిక జిల్లా రిజర్వ్ పోలీస్ లైన్‌లోని కోదండ రామాలయంలో ఈ నెల 6వ తేదీన జరిగిన శ్రీరామనవమి సందర్భంగా గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాలపై జిల్లా అడిషనల్ ఎస్పీలు స్వయంగా హాజరై అన్నసమారాధన జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు బి.రామకృష్ణ, రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు ఎ.శ్రీనివాసరావు, పవన్ కుమార్ రెడ్డి, పోలీసు అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఆర్. రఘురాం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బడి పిలుస్తోంది..



బడి ఈడు పిల్లలను గుర్తిస్తున్న విద్యాశాఖాధికారులు

- విద్యాశాఖ ముందస్తు చర్యలు
- బడి ఈడు పిల్లల గుర్తింపునకు శ్రీకారం

కంబాలచెరువు: త్వరలో ఈ విద్యా సంవత్సరం పూర్తి కాబోతోంది. మరో రెండు నెలల్లో కొత్త విద్యా సంవత్సరం రాబోతోంది. దీంతో నూతన విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన పలు చర్యలు, ప్రణాళికపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. చేపట్టాల్సిన పనులను నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే ముందస్తుగానే పూర్తి చేసే చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆయన విభాగాలకు, సంబంధిత స్కూలు యాజమాన్యాలకు సూచనలు చేస్తున్నారు.

మొదలైన కార్యాచరణ

నూతన విద్యా సంవత్సరంలో చేయాల్సిన కార్యాచరణలో భాగంగా ముందస్తుగా నగరంలోని బడి ఈడు పిల్లల గుర్తింపు పక్రియ చేపట్టారు. బాలబాలికలందరూ కచ్చితంగా బడిలో ఉండాలనే సంకల్పంతో స్కూలు ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులను జాగ్రత్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆవాస ప్రాంతాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి బడిబాట – బంగారు బాట ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై నగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించి, కొందరు బడిఈడు పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. రానున్న విద్యా సంవత్సరంలో బ్యాగుల బరువు తగ్గించి, పాఠ్య పుస్తకాలను సెమిస్టర్ వారీగా అందజేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పాఠశాల ప్రారంభం నాటికే విద్యార్థులకు బుక్స్ అందజేసి, కొత్త యూనిఫాం, బ్యాగ్, షూ అందించనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే దిశగా కృషి చేస్తున్నారు.

బస్సుల ఫిట్‌నెస్

మరో రెండు నెలల్లో నూతన విద్యాసంవత్సరం ఆరంభం కానున్న నేపథ్యంలో అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ బస్సులను నిబంధనలకు అనుగుణంగా సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వేసవి సెలవులు ఇచ్చి తిరిగి స్కూళ్లు ప్రారంభించే మధ్య ఖాళీ సమయంలో బస్సులన్నింటికీ రవాణాశాఖతో ఫిట్‌నెస్ చేయుంచుకోవాలని సూచిస్తున్నారు. దీనికి సంబంధించి స్థానిక విద్యాశాఖాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని అన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో విద్యాశాఖాధికారులు సమావేశం నిర్వహించి ఆ వివరాలు వెల్లడించారు.

> **చర్యలు తీసుకుంటున్నాం**
>
> నూతన విద్యాసంవత్సరం ఆరంభం నాటికి అన్ని పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలోని బడిఈడు పిల్లలను గుర్తించే పక్రియ ప్రారంభించాం. ప్రైవేట్ స్కూల్ బస్సుల నిర్వహణపై దృష్టి సారించాం. బస్సులన్నీ ఫిట్‌నెస్ పూర్తి చేసుకుని సిద్ధం ఉంచుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ నిర్వహణ ఉండాలి. ఆటోలలో విద్యార్థులను అధిక సంఖ్యలో తీసుకువస్తున్నారని పత్రికల్లో ఫొటోలతో సహా వార్తలు వస్తున్నాయి. అటువంటి వారి విషయంలో తగు సూచనలు ఇచ్చి, నిబంధనలు పాటించేలా చూడాలి.
>
> – బి.దిలీప్ కుమార్, అర్బన్ రేంజ్ డీఐ

సారా బట్టీలపై విస్తృత దాడులు

- 8 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- 35 లీటర్ల సారా స్వాధీనం
- ఐదుగురిపై కేసు



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్, ఈఎస్ లావణ్య తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సీహెచ్ లావణ్య ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్ సౌత్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. రాజానగరం మండలం రఘునాథపురం, నామవరం, రూరల్ మండలం శాటిలైట్ సిటీ గ్రామాల్లో ఇవి జరిగాయి. ఈ సందర్భంగా 8 వేల లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి, 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారులైన లంజపల్లి శ్రీను, పసల సత్తిబాబు, గోనబోయిన నారాయణమూర్తి, రేలంగి శ్రీను, వెలుగంటి గంగరాజుపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏఈఎస్‌లు నాగ రాహుల్, వినీషా తదితరులు పాల్గొన్నారు. కాగా.. సారా తయారీ కేంద్రాల ఆచూకీ తెలిసిన వారు 94409 02411 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఏసీ శివ ప్రసాద్, జిల్లా ఆఫీసర్ సీహెచ్ లావణ్య తెలిపారు. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

డిగ్రీలో మేజర్ సబ్జెక్టులపై స్పష్టత ఇవ్వండి

కంబాలచెరువు: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల ప్రవేశాల విషయంలో ప్రభుత్వం నిర్ణయాలను వేగంగా తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కోరింది. డిగ్రీ స్థాయిలో ఒక మేజరా రెండు మేజర్లను ఉంచాలన్న విషయంపై ప్రభుత్వం ఒక కమిటీని వేసి, ఆ కమిటీ సమావేశం నిర్వహించి పది రోజులు కావస్తున్నా ఇంకా ఎటువంటి నిర్ణయాన్ని ప్రకటించక పోవడం దారుణమని నిరసన వ్యక్తం చేసింది. లలితానగర్‌లోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆ విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడారు. మేజర్ల విధి విధానాలపై కమిటీ నివేదికను వెంటనే బహిరంగ పర్చాలన్నారు. ఇన్ని రోజులుగా కమిటీ నివేదిక రాకపోవడానికి కారణం అధికారుల సమన్వయ లోపమేనని విద్యార్థి లోకం భావిస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ అడ్మిషన్లతో ముడి పెట్టకుండా, డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు.

శిథిల మెట్లు.. సిబ్బంది ఇక్కట్లు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పంచాయతీ పరిధి రామకృష్ణనగర్‌లోని సచివాలయం వద్ద ఉన్న వాటర్ ట్యాంకు మెట్లు శిథిలావస్థకు చేరాయి. అధికారులు నిర్ణయించిన గడువు ప్రకారం ట్యాంకును శుభ్రం చేయాలంటే ప్రాణాలకు తెగించి సిబ్బంది పైకి ఎక్కాల్సి వస్తోంది. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి శుభ్రం చేయడం మానేస్తున్నారు. ట్యాంకును శుభ్రం చేసిన తేదీని బోర్డులో కూడా రాయడం లేదు. ట్యాంకు పక్కనే ఉన్న మ్యాన్‌హోల్ నాచు పట్టేసి అధ్వానంగా మారింది. కుళాయిలకు సరఫరా అయ్యే నీటి వల్ల ఎటువంటి వ్యాధులు సంభవిస్తాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మంచినీటి వ్యవస్థను పర్యవేక్షించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు.



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు మెట్లు



ట్యాంకును శుభ్రం చేసిన తేదీ ఎప్పుడో..



నాచుతో అపరిశుభ్రంగా మారిన మ్యాన్ హోల్

వృద్ధులకు బియ్యం, పండ్ల పంపిణీ

ప్రకాశం నగర్: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జోయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం వీరభద్రపురంలోని కస్తూర్బా ఆశ్రమంలో వృద్ధులకు బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి అర్థశాస్త్ర అధ్యాపకుల సేవలను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.లక్ష్మి, వి.రామలక్ష్మి, బి.చంటమ్మ పాల్గొన్నారు.

హాస్పిటల్‌కు బయలుదేరిన మహిళ అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: వైద్యం కోసం హాస్పిటల్‌కు వెళ్లిన తన భార్య ఇంటికి తిరిగి రాలేదని బొమ్మూరు కొత్తపేటకు చెందిన సత్యనారాయణ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరు కొత్తపేటకు చెందిన 48 ఏళ్ల కుసుమ కొంత కాలంగా గైనిక్ సమస్యతో బాధపడుతోంది. గోకవరం బస్టాండ్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నెల 14వ తేదీన భర్త సత్యనారాయణకు ఆసుపత్రికి వెళతానని చెప్పడంతో ఆయన బొమ్మూరు సెంటర్‌లో కుసుమను ఆటో ఎక్కించాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. దీనిపై హెడ్ కానిస్టేబుల్ వెంకట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి కాలం.. అగ్నితో జరభద్రం

- ప్రమాదాలకు ఎక్కువ అవకాశం
- గ్యాస్ సిలిండర్లతో జాగ్రత్త అవసరం
- నిర్లక్ష్యం వహిస్తే ముప్పు తప్పదు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్నిప్రమాదాలపై అనపర్తిలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

బిక్కవోలు: కట్టెల పొయ్యికి కాలం చెల్లింది. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా గ్యాస్ స్టవ్ దర్శనమిస్తోంది. వీటి వినియోగంపై అవగాహన లేక కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ఎండాకాలం అధిక ఉష్ణోగ్రతలతో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. విద్యుదాఘాతం, సిగిరెట్, చుట్ట, బీడీ ఆర్పివేయకుండా పడేయడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలతో జరిగే ప్రమాదాలను పక్కన పెడితే మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలే అధికమని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలతో వీటిని అరికట్ట వచ్చన్నారు.

గత ఆరేళ్లలో..

అనపర్తి ఫైర్ స్టేషన్ పరిధిలో గత ఆరేళ్లలో 335 అగ్ని ప్రమాదాలు జరిగాయి. సుమారు రూ.19,88,78,468 నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు ప్రమాదాలు నివారించడం సాధ్యమన్నారు. ముఖ్యంగా ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే వీలుంటుంది. 1944 ఏప్రిల్ 14న బొంబాయి ఓడరేవులో ఆయుధాలు, గన్ పౌడర్ కలిగిన నౌకలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 336 మంది ప్రజలు, 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారు. వారి సంస్మరణార్థం ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుపుకొంటున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- వంట గ్యాస్ వాడిన తర్వాత రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి.
- బయట నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వంటివి వేయకుండా వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. సిగరెట్, చుట్ట, బీడీ కాల్చినప్పుడు, వాటిని ఆర్పి పాడేయ్యాలి.
- ఇళ్లను వదలి వెళ్లేవారు విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. ఇలా చేయడం వల్ల వేడికి షార్ట్ సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది.
- వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి.
- సిలిండర్‌ను ఎప్పుడూ నిలువుగానే ఉంచాలి. సిలిండర్ కంటే స్టవ్ ఎత్తులో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.



సిలిండర్ నుంచి మంట వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న సిబ్బంది

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం, గ్యాస్ లీకైనప్పుడు మంటలను ఎలా ఆర్పివేయాలో ప్రయోగాత్మకంగా చూపిస్తున్నాం. ప్రమాదాల నుంచి కాపాడుకునే మెలకువలు నేర్పిస్తున్నాం. దీంతో ప్రమాదాలను చాలా వరకు తగ్గించగలుగుతున్నాం. నాలుగేళ్లలో సుమారు రూ.35 కోట్లు విలువైన ఆస్తిని కాపాడాం. ప్రమాదాలు సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి.
>
> – జె.శ్రీనివాస్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి, అనపర్తి

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో మాజీ ఎంపీ భరత్ రామ్

- వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి
- పార్టీ విభాగాల అధ్యక్షులతో మాజీ ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోని తీసుకువెళ్లడంతో పాటు వైఎస్సార్ సీపీని సిటీ నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని అనుబంధ విభాగాల అధ్యక్షులకు మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ సూచించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమితులైన నూతన అధ్యక్షులను గురువారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు విభాగాలకు ఎంపికైన వారిని అభినందించారు. కాగా.. యూత్ విభాగానికి వీణం వెంకటేశ్వరరావు (బిల్డర్ చిన్నా), మహిళా విభాగానికి పోలు విజయలక్ష్మి, రైతు విభాగానికి గౌరిజాల సర్వేశ్వరరావు, బీసీ సెల్‌కు పితా మురళీ రామకృష్ణ, ఎస్సీ సెల్‌కు తిరగటి దుర్గారావు, ఎస్టీ సెల్‌కు సాలా సావిత్రి, మైనారిటీ సెల్‌కు మహ్మద్ ఆరిఫుల్లాఖాన్ (చోటా ఖాన్), క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు పుట్టా చంద్రశేఖర్, విద్యార్థి విభాగానికి సింగంపల్లి కార్తిక్ అర్జున్, మున్సిపల్ విభాగానికి మజ్జి అప్పారావు, ఆర్టీఐ విభాగానికి మహ్మద్ అమీర్ బాషా, వలంటీర్స్‌కు అరుష భట్టు అనంతలక్ష్మి, గ్రీవెన్స్ సెల్‌కు పులగం రామలింగారెడ్డి, వాణిజ్య విభాగానికి యజ్జవరపు మరిడయ్య, వీవర్స్ విభాగానికి నందం స్వామి, వైఎస్సార్ టీయూసీ విభాగానికి నరవ గోపాల కృష్ణ, అంగన్‌వాడీకి బొమ్మాదేవి సూర్యకుమారి, సోషల్ మీడియాకు రేగుళ్ల బాలశ్రీధర్ (నాని), ఐటీకి చేబ్రోలు వెంకటలింగం, పబ్లిసిటీ విభాగానికి పెదిరెడ్ల శ్రీనివాస్, బూత్ కమిటీలకు సీరపు నాగేష్ చంద్రారెడ్డి (గణేష్) నియమితులయ్యారు. అలాగే జిల్లా స్థాయిలో మహిళా విభాగం అధ్యక్షురాలిగా మార్తి లక్ష్మి, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా హబీబుల్లా ఖాన్, ఐటీ విభాగానికి గుడాల జాన్సన్‌ను నియమించారు.

ప్రతిభావంతులకు కాపునాడు ప్రోత్సాహం



విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేస్తున్న కాపునాడు సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు కాపునాడు ప్రోత్సాహం అందిస్తుందని కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్ అన్నారు. దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో గురువారం రాజమహేంద్రవరం కాపునాడు కార్యవర్గం తరఫున బహుమతులు అందించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విన్నా మీనాక్షి (988 మార్కులు), మొదటి సంవత్సరం విద్యార్థిని పిడుగు జ్యోతి ప్రియ (470 మార్కులు)లను అభినందిస్తూ నగదుతో పాటు బహుమతులను నగర కాపునాడు గౌరవ అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్వరరావు సౌజన్యంతో అందజేశారు. బ్యాగులు, డిక్షనరీలను కార్యవర్గ సభ్యులు బహూకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్తులో మరింత బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, విన్నా వాసు, దేశినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలో గొడవ పడి ఇద్దరు పిల్లలతో వెళ్లిన తన కుమార్తె ఇప్పటివరకు తిరిగి రాలేదని బొమ్మూరుకు చెందిన పి.సత్యనారాయణ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరుకు చెందిన 26 ఏళ్ల మహిళకు రామచంద్రపురానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. వీరికి ఏడేళ్ల కుమారుడు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆ మహిళ బొమ్మూరులోని తండ్రి వద్దే పిల్లలతో ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన ఇంటిలో గొడవపడి ఎవరికి చెప్పకుండా ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. కానీ ఇప్పటివరకు తిరిగి రాలేదు. బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీహెచ్‌వోల నిరసన



సీతానగరంలో నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

పెదపూడి: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ క్లినిక్స్)లో పనిచేస్తున్న కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)లు తమ సమస్యల కోసం గురువారం సంపర పీహెచ్‌సీ వద్ద శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలన్నారు. తమకు రావాల్సిన ప్రోత్సాహకాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈపీఎఫ్‌వోను పునరుద్ధరించాలని, ఎన్‌హెచ్ఎం ప్రకారం 23 శాతం హైక్ ఇవ్వాలని, దూర ప్రాంతాల్లో ఉన్న సీహెచ్‌ఓలకు ట్రాన్స్‌ఫర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనతో ప్రజల వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగలేదని తెలిపారు.

సీతానగరంలో..

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరసన తెలిపారు. తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. అనంతర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఏవీకే చైతన్యకు అందజేశారు. నిరసనలో సీహెచ్‌వో ఎస్కే మౌనిక, బి.చంద్రశేఖర్, ఎస్కే చాంద్‌బీ, బి.,స్వరూప, స్పందన, నాగశ్వేత, అరుణ, ప్రశాంతి, చిన్నారి, స్వప్న పాల్గొన్నారు

కత్తితో బెదిరించి.. రూ.70 వేలు కాజేసి..

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో ద్విచక్ర వాహనం కొనిపిస్తానని చెప్పి గుంటూరు నుంచి ఇద్దరిని తీసుకువచ్చి రూ.70 వేలు నగదుతో పరారైన మోసగాడి ఉదంతం ఇది. గురువారం జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లాకు చెందిన శీల నాగ పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి మోటారు సైకిల్ కొనుక్కునేందుకు గుంటూరు వచ్చారు. రోడ్డుపై నిల్చుని ఉన్న వారి వద్దకు ఒక వ్యక్తి వచ్చి విషయం అడిగాడు. తాము మోటారు సైకిల్ కొనడానికి వచ్చామని చెప్పారు. అయితే ఇక్కడ వద్దు, రాజమహేంద్రవరంలో తక్కువ రేటు ఉంది అక్కడ ఇప్పిస్తానని చెప్పి వారిద్దరినీ తన కారులో ఎక్కించుకున్నాడు. రాజమహేంద్రవరం వచ్చిన తర్వాత కోటిపల్లి బస్టాండ్ వద్ద కారు ఆపి అందులో ఒకరైన సుబ్బారెడ్డిని దిగిపోమన్నాడు. వేలిముద్ర వేయాలంటూ నాగ పుల్లారెడ్డిని తీసుకెళ్లాడు. ఆల్కాట్ తోట సమీపంలోకి తీసుకెళ్లి, పుల్లారెడ్డికి కత్తి చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. భయపడిన పుల్లారెడ్డి తన వద్ద ఉన్న రూ.70 వేలు అతడికి ఇచ్చేశాడు. అనంతరం మోసగాడు కారులో వెళ్లిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా వేల్పులమ్మ తీర్థం

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన వేల్పులమ్మ వార్షిక తీర్థం గురువారం ఘనంగా జరిగింది. ఈ మేరకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఊరేగించారు.